# కన్యాశుల్కము- వరశుల్కము

"ఇప్పణ్ణుంచీ సోమిదేవమ్మ వేషం వెయ్యమంటే బాగుండదురా నాయనా. ఏదో అచ్చటా ముచ్చటా యేడాదేనా తీర్చుకోనివ్వకపోతే లోకం హర్షించదురా. నిజానికి పద్ధానుగేళ్ళేనా నిండలేదు పాపం. అప్పుడే కొప్పుపెట్టుకోమంటే ఘోరకలిగా ఉండదూ? యింతకీ యేకాలానికి తగినట్లు ఆకాలంలో నడవకపోతే విపరీతంగా వుంటుంది. అది వండాలా పెట్టాలా? మొన్న మొన్న కుట్టించుకున్న పరికిణీలు పారెయ్యమంటే యెలాగా? అఘాయిత్యం మాట లనకమ్మా నలుగురిలోనూ, అప్రతిష్ఠ పొందకు" అని సుబ్బమ్మ నెమ్మదిగనే చెప్పెను; గాని సూరావధానులు ఆ మాటలు వినిపించుకోలేదు. "మంచికీ మర్యాదకి వయస్సేమిటీ? అచ్చటా ముచ్చటా అని పాడుపనులు చేస్తూ ఉంటే వూరుకోమంటావా? మన యింట్లో యెప్పుడేనా శిఖ చుట్టుకోవడం వుందా. సెనగబద్దకంటే చిన్నబొట్టు పెట్టుకుంటే అందం వారిగిందా యేమిటి? బోగందానిలాగ పరికిణీవలివాటూనా? యివ్వేమీ పనికిరావు నాకు. బొత్తాముల రవికలు కూడా పారెయ్యాలవతల. మర్యాదగా తను అవతల పారేస్తే మంచిదే. లేకపోతే వారంరోజుల దాకా చూసి నేనే పారవేస్తాను. నాకు పిసాళం యెత్తుకువచ్చిందంటే బాగా జరగ"దని యాతడు ఖచితముగా చెప్పెను.

అది విని సుబ్బమ్మ మాట్లాడలేక పోయినది. దొడ్లో కూర్చుండి కూరతరుగుచున్న గున్నమ్మ యిది యంతయు విని కన్నుల నీరు పెట్టుకొనియెను.

ఆమె తొలిసారి కాపురమునకు వచ్చి పది దినములయినది. పున స్సంధానమయి మూడుమాసములే అయినది.

పాపము గున్నమ్మ చక్కని చుక్క. చామనచాయ అయినా శరీరము నిగనిగలాడుచుండును. విశాలమైన కన్నులలో ఆనందవికాసమునకు బదులు దుఃఖోన్మీలనము ప్రారంభమైనది. పిఱుదులను దాఁటు శిరోజనాలు జడవేసికొనినను శిఖచుట్టుకొనినను ఎంతో అందముగా నుండెడిదిగాని

యిప్పుడు కొప్పుపెట్టుకొనుటవలన ఆయందమే పోయినది. అర్ధరూపాయంత బొట్టు. గువ్వకన్ను చీర. చేతికి గాజులు లేకపోవుటయే గాక రాగిపట్టీలు. ఒడ లంతయు నొక రంగు. ముఖము మాత్రము పసుపు పూసికొనుటవలన నొక రంగు. "వలదువల"దనుచుండకా అవధానులు గొలుసులు చెరిపించి అందెలు చేయించెను. పుట్టింటినుండి తెచ్చుకొనిన సబ్బుబిళ్ళలు, సెంటుబుడ్లను అతడు చెరువులో పాఱవైచి వచ్చెను. అన్ని విధములను గున్నమ్మ బ్రతుకు ఇట్లు అధ్వాన్న మైపోయినది. సిగ్గువలన ఆమె వీధిముఖము చూచుట మానివేసెను.

## 2

పూర్ణయ్య ముగ్గురు బిడ్డలలో గున్నమ్మ రెండవది. శేషమ్మ యిప్పటికి అయిదేళ్ల పిల్ల. చలపతి పదియేండ్ల వాడు. భార్యపట్టువలన పూర్ణయ్య చలపతిని యింగ్లీషు చదువులో పెట్టెను. స్కూలు ఫైనలు పరీక్షలో చలపతి మొదటివాడుగా నెగ్గగా ఉపాధ్యాయులు అందఱును చదువు మానవద్దని చెప్పిరి. పూర్ణయ్య వెనుదీయఁగా సుందరమ్మ మంకుపట్టుపట్టెను. ఈసమయమున గున్నమ్మ వివాహయోగ్యయై యుండెను. అప్పటికామెకు తొమ్మిదవయేడు వచ్చినది. పూర్ణయ్య కష్టసుఖము లన్నియు వివరముగా చెప్పి సుందరమ్మచే "సరే" అనిపించుకుని అయిదువందల రూపాయలు పుచ్చుకొని గున్నమ్మను సూరావధానున కిచ్చెను. అతఁడు వివాహ వ్యయములనుగూడ అల్లునిమీదనే పెట్టెను.

ఇట్లు పూర్ణయ్య కూతురుపెండ్లి చేయుటయే గాక కొడుకు ఉన్నతవిద్యకుఁ గూడ పునాదులు వేసెను. యుక్తసమయములను అతఁడు రాజమహేంద్ర వరమున ప్రవేశించెను. చలపతి కాలేజీయందును, గున్నమ్మ మిషనువారి బాలికాపాఠశాలయందును ఒక్కనాడే ప్రవేశించిరి. పూర్ణయ్యకు రాజమహేంద్రవరము నందలి గృహవ్యయములు విపరీతముగా తోచినవి. సహజముగ లుబ్ధుఁడగు అతడు అక్కడక్కడ ప్రబలియున్న మసూచికములు కారణము చెప్పి మొదటి సంక్రాంతికి అల్లునిఁ దీసికొనివచ్చుట మానివేసెను. పండుగు వెళ్లిన నెలదినములవఱకును అవధాని "వుప్పాడ జరీ జామారు కాకపోతే పోయింది వక్క కోనసీమచాపు పెట్టరాదూ?" అనుకొనుచునే యుండెను.

చలపతికి పెండ్లి యయ్యెను. పెద్దకొమార్త నయిదువందల కమ్ముకొనిన పూర్ణయ్య చలపతికి వేయిన్నూటపదియార్లు కట్నము పుచ్చుకొనియెను. భార్యకు, కూతుళ్ళకును గూడ లాంఛనములు పుచ్చుకొనియెను. అవధానికిది యంతయు ఉద్రేకమును గలిగించెను. "ఎప్పటికేనా నా అయిదు వందలూ కక్కిస్తాను వీళ్ల చేత" అని యాతఁడు నిశ్చయించుకొనియెను.

దీనికిఁతోడు ఇక నొక అసందర్భముగూడ తటస్థించెను. అవధాని స్మార్తమున గట్టివాఁడే గాని నాజూకు పిల్లయగు గున్నమ్మకు అతఁడు తగడని చలపతి పెళ్ళిలో పేరంటాళ్లు పదిమందియు ననుకొనిరి. ఇది కర్ణాకర్ణిగా విని అవధాని రుసరుసలాడెను. గున్నమ్మ చిన్నపుచ్చుకొనియెను.

ఇంతేగాదు, పెండ్లి యేదుదినములును అతడు భార్యనే కనిపెట్టి చూచెను. ఒకపేరంటాలు పెళ్లికూతురుతల్లికి గున్నమ్మను పరిచయము చేయుచు "అయిదోతరగతి చదివింది. హార్మణీ బాగా వాయిస్తుంది. కుట్టుపనులు చక్కగా చేస్తుంది. వకటిరెండు మాట్లు బర్హో తోడిపిల్లలతో వేసినట్టు యింక నిట్లే మేమో చెప్పెను. కానయితే అప్పటికి గున్నమ్మకు పదకొండు సంవత్సరములు మాత్రమే వెళ్లినవి. అయినను అతనికి ఈ మాటలు వినగనే మిన్ను జరిగి మీదబడినట్లయ్యెను. ఒడలు మండిపోయినది. అప్పుడేమి చేయుటకును సాహిసింపలేక అతఁడు ఆనాలుగుదినములు మొగము మాడ్చుకొనియే యుండి ఇంటికి వెళ్లిననాఁడే "మీయమ్మాయిని యింక బర్లోకి పంపడానికి వీల్లేదు" అని నిక్కచ్చిగా ఉత్తరము వ్రాసెను.

అది చూచి సుందరమ్మ "జవాబు రాయకండి" అనియెను. ఏడిసినట్లే ఉంది సరసం. వాడి మాటలెవడు వింటాడూ! చెల్లాయిని చదువు మాన్పించడానికి వీల్లేదు" అని చలపతి అనియెను. "చదువుకుంటే యేంతప్పూ? యీమాటు రానియ్యి బావని నుంచోబెట్టి అదుగుతాను" అని శేషమ్మ అనియెను. పూర్ణయ్య "మానిపించేస్తే యేమిా?" అనగా "నేను మానను నాన్నా! ఈయేడు పరీక్షలో నెగ్గితే హార్మణీ బహుమతీ వస్తుంది" అని గున్నమ్మ విదళించి పలికెను. పూర్ణయ్య ఊరకుండెను.

జవాబు రాకుండుటయే గాక తను యింకను బడికి పోవుచునే యున్నదని విని అవధాని మండిపడి "ఆ పిల్ల నాకక్కర్లేదు" అని చిందులు త్రొక్కఁదొడఁ

గెను. తల్లి నయభయములు చూపి అనేక విధముల చెప్పగా వారముదినముల కాతఁడు శాంతించెను. లేకున్న అతఁడేమి చేయఁగలడు! గున్నమ్మను విడిచిన మతీ భార్యయేది? అయిదువందలిచ్చినగాని పెండ్లికాని - పెళ్లామును విడిచిన ఆత్రగానికి పిల్ల నిచ్చువా రెవరు? సుబ్బమ్మ యీ మాటలు చెప్పిన వెంటనే అతనికి నాడు లన్నియు క్రుంగిపోయెను. కొంతసేపు అతఁడు బుసకొట్టికొట్టి "కాపురానికి రానియ్యి యేంచేస్తానో దాన్ని?" అని దిగ్గునలేచి వీధిలోనికి బోయెను.

## 3

పదమూడవయేడు ముగియు ననగా గున్నమ్మ రజస్వల యైనది. పిదప రెండు మాసములకే పట్టుపట్టి అవధాని కార్యము చేసికొనియెను. అతని యింటి కాతఁడే పెద్ద. ఒక్క తల్లిమాత్రమే అతనికి వెనుక దక్షత. కార్యమయిన వెనుక రెండు మాసములు అయినఁగాకుండ అవధాని గున్నమ్మను తీసికొని వెళ్ళెను.

పూర్ణయ్య కొమార్తకు కావడిపెట్టె, రెండు బిందెలు, కంచము, కంచు ఆకు బూరా యొకటి, మామిడాడ చెంబొకటి, పాందాను, పరుపు, కుర్చీ, సాదామంచము, సారె పెట్టెను. ఎంత పోరినను భర్త యింతకంటె ఎక్కువ పెట్టకపోవుటచే సుందరమ్మ రహస్యముగా తన మెడలోని కాసులలో మూడు ఇచ్చెను. అమ్మమ్మ పదునైదురూపాయలు లిచ్చెను. చలపతి సబ్బుబిళ్ళలు, సెంటుబుడ్లు, అగరువత్తులు, నాలుగు నవలలు, రవివర్మ బొమ్మలు ఆఱు తనకు ఉత్తరములు వ్రాయుచుండుటకు కవర్లు కాగితములు, తపాలాచీట్లు రూపాయవి, ఫౌంటెనుకలము, శ్యానుసిరాబుడ్డి, ఫేసుపౌడరుడబ్బా యొకటి, పాటలు వ్రాసి కొనుటకొక బైండు- ఇంక నిట్టివి యిచ్చెను.

ఈ వస్తువులతోడను, తాను బడిలో బహుమతీపొందిన హార్మోనియము తోడను గున్నమ్మ నదురుబాదా ప్రవేశించినది. ఇరుగుపొరుగు స్త్రీలు చూచి "ఐదువందలు పుచ్చుకున్నా సారి బాగానే పెట్టేరు. సంసారిపక్షానికి లోటు లేదు" అనిరి. మరునాడు గున్నమ్మ సామానంతయు సద్దుకొనియెను. సుబ్బమ్మ మఱల ఇరుగుపొరుగువారిని తెచ్చి తన కొడుకు గది చూపి ఆనందించెను.

జాముప్రొద్దువేళ అవధాని వీధి అరుగుమీద కూర్చుండి యొక విద్యార్థికి ఆశీర్వచనపుపనసలు చెప్పుచుండెను. ఇరుగుపొరుగు బాలికలు చుట్టును మూగి బలవంతము చేయఁగా అత్తగారుగూడ "పోనీ పాడవే" అని సెలవీయగా గున్నమ్మ హార్మోనియము వాయించుచు "తొలినేఁజేసిన పూజాఫలములు" అని పాడఁదొడఁగెను. అది విని అవధాని మొదట నిర్విణ్ణుడై పిదప ఉగ్రుఁడై లోపలకు వెళ్లి ఉఱికెను. బాలికలు చెదరిపోయిరి. తల్లి తెల్లపోయెను. గున్నమ్మ నిర్ఘాంతపడెను. తుదకు అతఁడు కొట్టినంతపని చేసి ఆపెట్టెను పెంటమీదికి గురిపెట్టి శిష్యుని వెంట నిడుకొని రామచంద్రపురము వెడలిపోయెను. మఱునాఁడాతడు సుబ్బుబిళ్ళలు మున్నగునవి దొరికినంత వఱకును చెఱవులో పారవేసివచ్చెను.

అది మొదలు. "అయిదువందలు తిన్నాడు దీని అబ్బ. నా దగ్గిర వేషాలు పనికిరావు. చద్దివణ్ణం కట్టిపెట్టు. రోజురోజూ తలదువ్వుకోనక్కర్లేదు" రెండుపూటలా వంటచేయించు" అని యాతండు తల్లికి చెప్పి అట్లే నడిపింపఁదొడఁగెను. గున్నమ్మ కిప్పుడు సబ్బుబిళ్ళలు లేవు. శెంటుబుడ్లు లేవు కవర్లు లేవు కాగితములు లేవు సిరాబుడ్డిలేదు. కలముపై తీయుటకు వీలులేదు. హార్మోనియము పనికిరాదు. నవలలు చూరులో నున్నవి. ఆమె కిప్పుడున్నవి అంట్లు, చెంబులు, ఆవుపేడ, తడిబట్ట, వంటిల్లు, చీపురుకట్ట, ఇంతే. కేవలము ఇంత మాత్రమే. "బాదం ఆకులతో విస్తళ్ళుకుట్టడం కూడా నేర్పు యీపాటికి" అని అవధాని తల్లికి అజ్ఞాపించెను.

## 4

చలపతికి పోలీసుసబినస్పెక్టరీ అయినది. అతనికి భార్యకూడా కాపురమునకు వచ్చెను. ఉద్యోగరీత్యా అతఁడు గుడివాడ వెళ్ళవలసి వచ్చెను. అయినను కుటుంబము రాజమహేంద్రవరమునందే యుండెను. పూర్ణయ్య ఆర్యాపురములో చిన్న యిల్లు సంపాదించెను.

ఒకటి రెండేళ్ళు గడిచినది. శేషమ్మకు పెండ్లియీడూరాగా పూర్ణయ్య వరాన్వేషణము ప్రారంభించెను. "అవధానిలాంటి మూర్ఖుణ్ణి చూడవద్దు. శేష

పెద్దచెల్లాయికంటే నాజూకుపిల్ల. ఆస్తిలేకపోయినా సరే. సరసుణ్ణి చూడండి" అని చలపతి వ్రాయగా సుందరమ్మ "నాతండ్రికి చెల్లెళ్ళమీద యెంతో ప్రేమ. యీ వేపుకి వస్తే పెద్దమ్మాయి కష్టాలు తప్పించమని చెప్పాలి" అనుకొనియెను. పూర్ణయ్య నాలుగ యిదుసంబంధములు చూచి వ్రాయగా చలపతి వచ్చి అయిదు వందలరూపాయల కట్నమిచ్చుట కంగీకరించి యొక మంచి సంబంధమును నిశ్చయపఱిచెను.

"నా దగ్గర పుచ్చుకొన్న అయిదు వందలూ యిస్తేగాని మీపిల్లని పంపను మీ చిన్నల్లుడుతోపాటు నాకు గూడా అయిదువందలు కట్నమిస్తేగాని నేనురాను" అని అవధాని పూర్ణయ్యతో చెప్పగా అతఁడు వెళ్ళి చలపతితో చెప్పెను. చలపతి "అందులో వక షరతు మంచిదే" అని చెప్పి అయిదువందల రూపాయలు తండ్రికిచ్చి "యివి నీదగ్గిర పుచ్చుకున్న రూపాయలు" అని యిచ్చి చెల్లాయిని తీసుకురా" అని పంపెను.

శేషమ్మ పెండ్లికి గున్నమ్మ వచ్చినది. పెండ్లి చక్కగనే జరిగినది. అవధాని రాలేదు. రాజమహేంద్రవరమున నున్నంత కాలమును గున్నమ్మ వేషము మార్చుకొనియెను. ఆమె యిక్కడ నున్నంత కాలమును హార్మోనియము విడువలేదు.

## 5

చలపతికి రామచంద్రపురము బదిలీయయ్యెను సుందరమ్మ వెంటవెళ్ళి "నాయనా! చెల్లాయికి చెర తప్పించురా" అనియెను. "ఇక అదే తరువాయి" అని తల్లికి చెప్పి యీతఁడు సంగతి యంతయు సర్కిల్ ఇన్స్పెక్టరున కెఱిగించి అవధానికి కబురంపెను.

కాని అవధాని వెళ్లలేదు "ఇలా ఉందా నీపనీ?" అని చలపతి ముందు భార్యను, తల్లిని పాలకిమీద పంపించి పెద్దయినస్పెక్టరుతో తాను షికారుగా బయలుదేరివెళ్ళెను.

వచ్చినవారి కందఱికిని సుబ్బమ్మ గౌరవము చేసెను.గాని అవధాని మాత్రము ధుమధుమలాడఁదొడఁగెను. ఒక నిమిషము గడచిపోయిన తరువాత చలపతి అయిదువందల రూపాయల నోట్లు చేతులో నుంచి

అవధానితో నిట్లు చెప్పెను. "నీ దగ్గర పుచ్చుకున్న అయిదువందల రూపాయలూ శేషపెళ్లిలో యిచ్చి వేశాము. ఇవి నీకు కట్నము. అంటే యేమిటో తెలిసిందా. ఇది వరలో నువ్వు మాచెల్లిని కొనుక్కున్నావు. ఇప్పుడు నిన్ను మాచెల్లెలు కొనుక్కుంది. ఇక నోరెత్తే వంటే బాగా జరగదు. ఈ క్షణం మొదలుకొని నువ్వు మా చెల్లాయికీ నౌకరన్నమాట. అది చెప్పినట్లు వినకపోతే యిదుగో యినస్పెక్టరుగారు అరదండాలు తగిలిస్తారు నీకు. మా చెల్లాయి సబ్బుబిళ్ళలూ సెంటుబుడ్లూ పారేశావు. జ్ఞాపకం ఉందా? హార్మోనియం పగలగొట్టిన సంగతి కూడా జ్ఞాపకం ఉందా? ఇంకా నువ్వు దాన్ని పెట్టిన బాధలు జ్ఞాపకం ఉన్నాయా? జాగర్త. కుంయిమన్నా వంటే నీ గుండెల్లో నిద్రపోతాను".

ఇది విని అవధాని ద్రాన్పడెను. సుందరమ్మ ఇంతలో గున్నమ్మకు మంగళ వేషమువేసెను. గున్నమ్మ మఱల చక్కని చుక్కయైనది. సుబ్బమ్మ కొడుకునకు జరిగిన పరాభవమునకు దుఃఖమును కోడలి సౌందర్యమునకు ఆనందమును పొందినది. సుబ్బమ్మ గున్నమ్మ యెడల చూపిన ఆదరమును చలపతి ప్రశంసించెను.

గున్నమ్మ వచ్చి "అన్నయ్యాగారూ, యివాళ మాయింటో వుండాలండీ" అని చెప్పగా పెద్దయినస్పెక్టరు "అలాగూ ఉంటానమ్మా" యని ఉండిపోయెను.

మఱునాడు యినస్పెక్టరు లిరువురును "జాగర్త" అని అవధానికి చెప్పి వెడలిపోయిరి. చలపతి భార్యను తల్లిని గూడ తీసికొనిపోయెను.

"ఇదిగో, ఏమండోయి యేంచేస్తున్నారూ? అలాకూచుని పనసలు వల్లిస్తూ ఉంటే యెలాగా? రామచంద్రపురం వెళ్లి మా అన్నయ్య చీరలిస్తానన్నాడు పట్టించుకురండి. మా వదిన సబ్బుబిళ్లలూ, సెంటుబుడ్లూ, హార్మణీ, బొత్తాముర వికలూ, జాకెట్లూ యిస్తానంది. అవి కూడా పట్టించుకురండి. బజారుకి వెళ్ళి వీసెడు బంగాళాదుంపలూ, పదలం నీరుల్లిపాయలూ, పంపు పచ్చిమిరపకాయలూ కూడా తేవాలి. అన్నట్లు చెప్పడం మరచిపోయాను మా అన్నయ్య నడిగితే టీ డబ్బా వకటీ, కాఫీపొడుండబ్బా ఒకటీ, యెత్తెడు పంచదారా, యిప్పిస్తాడు. తోటమోడలు కూడా రెండు కావాలని చెప్పండి. వెళ్లేటప్పుడు ముందు గాజులు మల్లయ్యని పంపి మరీ వెళ్లాలి సుమండి.

అందిలు చెరిపి గొలుసులు చెయ్యడానికి కంసాలిని తరవాత తీసుకురా వచ్చునులెండి. ఇక్కడ ఉన్నట్లు తొరగా రావాలి. మీారక్కడ ఆలస్యం చేశారంటే ఆకలవుతోంది నేను ఉండలేను. యిప్పు డెనిమిదిగంట లవుతుంది. పదయేటప్పుటికి రాకపోతే బాగా జరగదు. అన్నట్టు అలారంటైంపీసు కూడా వుంటేగానీ యీ పల్లెటూళ్ళో యెలాగా వేగడం? యెన్నాళ్ళనుంచో నోరు చచ్చిపోయి ఉంది. పదలం పకోడీలూ, ఏబులం మసాలావడలూ కూడా పంపమన్నా నని కూడా చెప్పాలి మా అన్నయ్యతోటి. యిందులో యేం మరిచిపోయినా వచ్చిన వెంటనే మళ్ళీ పంపిస్తాను యేమనుకున్నారో. కాకినాడ నుంచి యెవరో వచ్చి రామచంద్రపురంలో నాటకాలాడుతున్నారుట. అసలు చంద్రకాంత నాటకమూ, సారంగధర నాటకమూ ఆడతారో ఆడరో, ఆడితే యెప్పుడో, యీవేళ గాని రేపటెల్లుంటగాని ఆడీ నాటకమేమిటో వివరంగా కనుక్కురావాలి సుమండీ. మా వదిన పూలూ, సూదులూ కూడా యిస్తానంది. మా అమ్మ మళ్ళీ యెప్పుడు వస్తుందో అడిగిరండి" అని గ్రుక్కతిప్పుకొనకుండ గున్నమ్మ చెప్పగా అవధాని తెల్లవోయెను. "తెల్ల మొహం వేసుకుని చూస్తేకాదు. నుంచున్నపళంగా వెళ్ళాలి. మీారిలా ఆలస్యం చేస్తే భోజనం చేసి మా అన్నయ్య యేవూరేనా వెడితే తరవాత కష్టం. ఇంకా లేవరేం?" అని యామె మఱల నిక్కచ్చిగా చెప్పెను.

ఏమిచేయవలయును! అవధానికి ఇప్పుడు దినములు మంచివికావు. గ్రహబలము చాలదు. పాప మాతఁడు తహతహపడెను. దుఃఖించెను. తన యవస్థను నిందించుకొనియెను. "దైవమా! లేవా" అని పరితపించెను. ఏమి చేసిన నేమి ఫలమూ? "చెప్పినట్లు చెయ్యకపోతే చలపతి గుండెల్లో నిద్రపోతాడు. చలపతి వూరుకున్నా బుగ్గమీాసాల పెద్దయినస్పెక్టరు నాయుడు వూరుకుంటాడా? నా కర్మం కాలింది. లేకపోతే స్మార్తం కంఠోపాఠంగా వచ్చినవాడికి నాకీకిరస్తానీ సంబంధం యేమిటి?" అని యాతఁడు వగచుచు రామచంద్రపురము వెళ్ళెను.

మగడు యమయాతన పెట్టుచున్నను తన్నేకవిధముల కనిపెట్టిన అత్తగారిని గున్నమ్మ పూవులలో పెట్టి పూజించెను. భర్తను మాత్ర మామెపూర్తిగా మార్చివేసెను. అవధానికి ఇప్పుడు బంగాళాక్రాపింగు, పట్టుకుచ్చులవంటి

మీసములు, మల్లెపూవులవంటి మల్లుపంచెలు, ఫ్లానలు షర్టులు, వూలుకోట్లు, కాళ్ళను దారల జోళ్ళు, కండ్లకు అద్దములు, చేతిలో బెత్తము, కుడిచేతి చిటికినవ్రేలికి రవల ఉంగరము, ఎడమచేతి మణిబంధమున తోలుపటకాగల రిస్టువాచీ, వేస్టుకోట్లు, నెక్టయిలు, జేబురుమాళ్ళు, క్రాఫింగునకు వేసలైను, బట్టలకు సెంట్లు, సైకిలు ఎక్కుట నేర్చుకొనునంత వఱకు నాతని గున్నమ్మ నిలువనీయలేదు.

ఈ వేషముతో తాను నదురుబాదాలో నుండజాలకయు, గున్నమ్మ పల్లెలో నుండలేననుట వలనను అవధాని రాజమహేంద్రవరము ప్రవేశించెను. చలపతి నదురుబాదాలోని నివేశనమును భూములను ధర రాబట్టి విక్రయించి వేసి అవధానిచేత రాజమహేంద్రవరమున వర్తకము ప్రారంభింపఁచేసేను. శేషమ్మ భర్త అవధానిలో వాటా కూడెను.

గునమ్మకు అవధాని మునుపు యముడు. ఇప్పుడు హృదయేశ్వరుడు. అవధానికి గున్నమ్మ మునుపు బానిస. ఇప్పుడు జీవితేశ్వరి. ఈశ్వరాధీన మైయున్న కాలమెప్పుడు నొక్కరీతి నుండదు. ♦